

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

## ఏక్‌పల్

**భాష:** హింది, **కథ** - మైత్రేయి దేవి, **స్క్రీన్‌ప్లే,దర్శకత్వం** - కల్పనాలాజ్మి

**నటీనటులు** - షబనా ఆజ్మీ, ఫరూఖ్ షేక్

**విడుదల:** 1986




**భారతీయ** సినిమా స్త్రీ పురుష సంబంధాల్ని అర్థం చేసుకోవడంలో కాని, వారి మధ్య పెనవేసుకునే ప్రేమ, అభిమానం, సెక్స్‌లాంటి విషయాల్ని గురించి విశ్లేషించి సూటయిన ఆవిష్కరణలు చేయడంలో గాని పరిపక్వత సాధించలేదనే చెప్పుకోవచ్చు. ముఖ్యంగా జీవ సంబంధమయిన సెక్స్ విషయంలో మన సినిమాకి స్పష్టత కొరవడిందనేది వాస్తవం. అయితే విశృంఖలమయిన శారీరక ప్రదర్శనలు చేయడం లేదా సెక్స్ గురించి చూపించడమే పాపమనే భావం కూడా నెలకొని ఉంది. ఇలా రెండు ‘అతి‘ భావాలతో మన సినిమా రంగం తలమునకలయి ఉంది. అంతే తప్ప స్త్రీ పురుషుల మనోభావాలను సరైన రీతిలో ప్రదర్శించేలా మన సినిమా సరికొత్త ఈడియమ్‌ని సంతరించుకోలేక పోయింది.

కాని భారతీయ నవ్య సినిమా రంగంలో మాత్రం స్త్రీ పురుషుల మధ్య పెనవేసుకుని ఉన్న వాస్తవ అంశాల ప్రతిపాదన, వాటిమధ్య చెలరేగే సంఘర్షణల చిత్రీకరణ కొంత మేర జరిగిందని చెప్పుకోవచ్చు. శ్యాంబెనగల్ మొదటి చిత్రం అంకుర్ నుంచి మొదలు అనేక మంది ఆధునిక దర్శకులు స్త్రీ పురుషుల మధ్య సంబంధాల్ని సెక్స్ అంశాల్ని సూటిగా చర్చకు పెట్టడం ఆరంభించారు. ఆ కోవకి చెందినదే కల్పనాలాజ్మి దర్శకత్వం వహించిన 'ఏక్ ఫల్'. 1986లో తీసిన ఈ 'ఏక్‌పల్'కు మైత్రీయీదేవి నవల మూలాధారం. షబనా ఆజ్మీ, ఫరూక్ షేక్ తదితరులు ప్రధాన భూమికల్ని పోషించారు.



కథాంశం విషయానికి వస్తే ప్రియం ఒక అందమైన యువతి, అస్సాంకు చెందిన ఆమె, అందమైన డేరింగ్ డాషింగ్‌లా కనిపించే ఓ యువకుడితో ప్రేమలో పడుతుంది. కొంతకాలం తర్వాత అతను పై చదువుల కోసం విదేశాలకు వెళ్తాడు. అప్పటిదాకా కేవలం తనతో కాలక్షేపం మాత్రమే చేశాడు అని ప్రియం గ్రహిస్తుంది. తర్వాత ప్రియంకి మరొకనితో వివాహమవుతుంది. తన తండ్రి అభీష్టం మేరకు జరిగిన వివాహం ఆమెకు ఎక్కువ కాలం సంతోషాన్నివ్వలేక పోతుంది. పైగా ఆమె గర్భం పోవడంతో పరిస్థితి మరింత దిగజారుతుంది. భార్యాభర్తల మధ్య సంబంధాలు రొటీన్ దశకు చేరుకుంటాయి. ఇంతలో ప్రియం భర్తకి విదేశాలకి వెళ్ళే అవకాశం వస్తుంది. అప్పటికే విదేశాల్నించి తిరిగి వచ్చిన ప్రియం స్నేహితుడు తిరిగి ఆమెను కలుస్తాడు. ఆమె జీవితంలోకి మనసులోకి తిరిగి ప్రవేశిస్తాడు. క్రమంగా వారి అనుబంధం గతంలో ఎక్కడ నిలిచి పోయిందో అక్కడి నుంచి పునఃప్రారంభమవుతుంది. అప్పటికే అనేక సంవత్సరాలు వైవాహిక జీవితం అనుభవించిన ప్రియం ప్రియుడి సాంగత్యంలో సరికొత్త ఆనందాన్ని, సౌఖ్యాన్ని పొందుతుంది. భిన్నమైన అనుభూతిని కలిగించిన ప్రియుడి సాన్నిహిత్యం తనకు ఇదివరకే పెళ్ళయిందన్న వాస్తవాన్ని కూడా మరపింపజేస్తుంది. పెళ్ళికి ముందు కేవలం ప్రేమ మాధుర్యాన్ని చూసిన ప్రియం పెళ్ళయిన తర్వాత భర్త చెంత రొటీన్ సెక్స్‌ని అనుభవించిన ఆమె ప్రియుడి వద్ద అమితమైన సంతోషాన్ని పొందుతుంది. ప్రియం గర్భవతి అవుతుంది. సంఘ విమర్శని సైతం లెక్క చేయకుండా బిడ్డను కనడానికి నిర్ణయించుకుంటుంది. ఆమె ప్రియుడు మాత్రం పరిస్థితిని గమనించి వెనక్కి తగ్గుతాడు. ఇంతలో ప్రియం భర్త విదేశాల్నించి తిరిగి వస్తాడు. అతనికి ప్రియం నేరుగా విషయం చెప్పేస్తుంది. తనలో పెరుగుతున్న బిడ్డ మరొకరివల్ల సంక్రమించిందని కూడా చెప్పేస్తుంది. మొదట అవాక్కయినప్పటికీ తేరుకున్న భర్త ఆమెను ఆమె బిడ్డను అంగీకరిస్తాడు. ఆమె పునరుత్పత్తి హక్కుని గౌరవిస్తాడు. ప్రియం తన అభీష్టం మేరకు బిడ్డను కంటుంది. పెళ్ళయిన తర్వాత భర్తతో కలిగిన గర్భం నిలవకపోవడంతో తల్లిని కావాలన్న ఆమె అభీష్టం ఈ బిడ్డ వల్ల నెరవేరుతుంది. అంతేకాదు తను ప్రేమించిన వ్యక్తి ఎంతటి అవకాశవాదో కూడా ఆమెకు తెలిసి వస్తుంది. భర్త యొక్క ఓపెన్ మైండెడ్‌నెస్, అతని ఆధునిక ఆలోచనాధోరణి, ప్రేమగుణం కూడా ఆమె గ్రహిస్తుంది. మొత్తం మీద ప్రేమకోసం తపించే ప్రియం యొక్క మానసిక స్థితిని, శారీరకంగా ఆమె మథనాన్ని, సంతోషాన్ని ఈ చిత్రంలో కల్పనాలాజ్మి కళాత్మకంగానూ ఒకింత శృంగార భరితంగానూ చూపించారు. వ్యక్తిగా ప్రియం ఆలోచనల్ని, అభీష్టాల్ని, అనుభవాల్ని ప్రదర్శించడంలో దర్శకురాలి ఊహకు ప్రతి బింబంగా షబనా ఆజ్మీ పాత్రని సజీవం చేశారు. పైకి రొమాంటిక్ సినిమాగానూ విశృంఖలత్వాన్ని సంఘర్షణను, పునరుత్పత్తి హక్కుని చర్చకు పెట్టడం ద్వారా 'ఏక్‌పల్' ఒకింత కొత్త ఒరవడిగా ప్రారంభించింది. ఆ మేరకు అది విజయవంతమయిన చిత్రమే.

✡✡✡

# దృష్టి

**భాష:** హింది, కథ,స్క్రీన్‌ప్లే - శశిపాండే, నిహలానీ; **కెమెరా,దర్శకత్వం** - గోవింద్‌నిహలానీ,
నటీనటులు - డింపుల్, శేఖర్ కపూర్, మీటావశిష్ట్,
**విడుదల:** 1990




**మహానగరాలకూ** మామూలు ఊళ్ళకు నడుమ విశాలమైన అంతరాలున్నట్టే అక్కడ ఉండే కుటుంబాల మధ్య వైవాహిక సంబంధాల మధ్య, విస్పష్టమయిన తేడాలున్నాయి. మామూలు ఊళ్ళల్లో సనాతన కుటుంబ లక్షణాలు, భార్యాభర్తల బంధాలు అనుబంధాలు, సమిష్టి విలువల రక్షణ తదితర అంశాలు ప్రధాన భూమికను పోషిస్తే, మహానగర జీవిత విషయాల్లోకి వచ్చినప్పుడు కుటుంబం కంటే తమ వ్యక్తిగత ఆసక్తులు, విలువలు, స్వేచ్ఛ తదితర అంశాలు ముందు వరుసలో నిలుచుంటున్నాయి. దీనికి తోడు భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్థులయినప్పుడు పరిస్థితి మరోలా ఉంటుంది. అంతేకాదు, వారిద్దరూ మామూలు 9-5 ఉద్యోగాలు కాకుండా ప్రత్యేకమయిన ప్రొఫెషన్స్‌లో ఉన్నప్పుడు వారి స్థితి మరింత భిన్నంగా ఉంటుంది. సరిగ్గా ఇలాంటి స్థితినే ఆధారం చేసుకుని గోవింద్ నిహలానీ ఓ విశిష్టమైన చిత్రం నిర్మించాడు. అది 'దృష్టి'. ఈ చిత్రంలో గోవింద్ నిహలానీ స్త్రీ పురుషుల్లో వ్యక్తిగతమయిన ఆసక్తులు అభీష్టాల్ని మించి కుటుంబంలో సమిష్టిగా ఉత్తేజభరితమయిన పరిపక్వతను సాధించడం ఎంత కష్టమో చర్చిస్తాడు. వ్యక్తిగా స్త్రీ, పురుషులు డిసాల్వ్ అయి భార్యాభర్తలుగా సమిష్టి లక్షణాలు సాధించేందుకు ఎంత అవగాహనను సాధించాలో ఈ చిత్రం చర్చకు పెడుతుంది. గోవింద్ నిహలానీ నిర్మించిన ఇతర చిత్రాలాగా 'దృష్టి' కూడా రెండు ప్లేన్స్‌లో మనకి కనిపిస్తుంది. పైకి భార్యాభర్తల వివాహేతర సంబంధాలు, విడిపోవడాలు కనిపించినప్పటికీ, స్నేహ సంబంధాలతో సమిష్టితత్వంలో కుటుంబం ఎలా రూపొంది ఉండాలో 'దృష్టి' అంతర్లీనంగా సూచిస్తూ సాగుతుంది. ఈ చిత్రం చివర్లో విడిపోయిన భార్యాభర్తలు స్నేహితులుగా ఒడ్డున తమని తాము పునర్ నిర్మించుకుంటున్న స్థితిలో చిత్రం ముగుస్తుంది.

ప్రతి కళాత్మక సృష్టి రాజకీయమే అని భావించే ప్రతిభావంతుడయిన దర్శకుడు గోవింద్ నిహలానీ. ఆయన నిర్మించిన 'దృష్టి' కేవలం పన్నెండు సీక్వెన్స్‌లతో రూపొందింది. వాటి మధ్య మాంటేజ్ టెక్నిక్‌ని వినియోగిస్తూ గోవింద్ నిహలానీ సంక్లిష్టమయిన భార్యాభర్తల సంబంధాల్ని ప్రతిభావంతంగా చర్చించారు. ప్రతి దృశ్యమూ ఓ విలక్షణ మలుపునే సూచిస్తుంది. దృశ్యాల మధ్య కాలాంతరం వారాల నుంచి సంవత్సరాల దాకా సాగుతుంది. మారిన కాలానికి మారుతున్న మనస్తత్వాలకి దృశ్యాలు సాక్షీభూతాలవుతాయి.



చిత్రకథాంశం విషయానికి వస్తే బొంబాయిలో నివసించే సంధ్య, నిఖిల్‌లు విద్యావంతులయిన మంచి అవగాహన కలిగిన భార్యాభర్తలు. సంధ్య ఓ ప్రచురణా సంస్థలో బాలల పుస్తకాల్ని ఎడిట్ చేసే ఉద్యోగం చేస్తూ ఉంటుంది. నిఖిల్ ఓ విదేశీ

సంస్థలో సైంటిస్ట్‌గా పనిచేస్తూ ఉంటాడు. అన్యోన్యంగా నివసించే వారి వివాహ వార్షికోత్సవం రోజున తన మిత్రులతో కలిసి వచ్చిన మంచి గాయకుడు రాహుల్‌తో సంధ్యకి సాన్నిహిత్యం కుదురుతుంది. కాని ఆ సాన్నిహిత్యం వారి మధ్య పెరిగిన అభిమానం సంధ్యకు ఆమె భర్తపట్ల ఉన్న అనురాగాన్ని భంగం కలిగించదు. వారిద్దరి మధ్య అనుభూతితో కూడుకున్న సంబంధం మాత్రం పెనవేసుకుని పోతుంది. సంధ్యకు దగ్గరి మిత్రురాలయిన ప్రభ రాహుల్‌తో సంధ్యకున్న సంబంధాన్ని విభేదిస్తుంది. సరైంది కాదని హెచ్చరిస్తుంది. ప్రభ సూచన మేరకు సంధ్య రాహుల్‌ని దూరం చేసుకుంటుంది. ఇంతలో తాను గర్భవతినని సంధ్య తెలుసుకుంటుంది. అపుడే మరో సంతానం కలగడం తనకిష్టం లేదంటాడు నిఖిల్. మొదట విముఖత ప్రదర్శించినా తర్వాత అబార్షన్‌కి అంగీకరిస్తుంది సంధ్య. కాని తదనంతరం వారిద్దరి నడుమ దూరం పెరుగుతుంది. ఒకరోజు నిఖిల్ తనతో పనిచేసే ప్రిందతో తన అఫేర్‌ని భార్యకు చెబుతాడు. తాను ఆమెతోనే జీవించాలనుకుంటన్నట్టు వివరిస్తాడు. తన ఆలోచనని మరోసారి సమీక్షించు కొమ్మని సంధ్య కోరుతుంది. కొంతకాలం తర్వాత విడాకులు ఇమ్మని నిఖిల్ కోరతాడు. మొదట నిరాకరించినా సంధ్య నిఖిల్‌తో విడాకులు తీసుకుంటుంది. తర్వాత కాలగమనంలో ఒంటరిగా జీవించే శక్తిని పుంజుకుంటుంది సంధ్య. ఓ సంవత్సరం తర్వాత ప్రిందతో అనుబంధం విచ్ఛిన్నం కావడంతో నిఖిల్ కూడా ఒంటరివాడయిపోతాడు. ఓ రోజు సముద్రపు ఒడ్డున ఇద్దరూ తారసపడతారు. సంధ్య తనకు గతంలో రాహుల్‌తో ఉన్న సంబంధాన్ని నిఖిల్‌కి చెబుతుంది. అది వినగానే అబార్షన్‌కు గురయిన పాప రాహుల్ పాపా? అని నిఖిల్ ప్రశ్నిస్తాడు. కాదంటుంది సంధ్య. మన పాపే అని నిర్ధారణగా చెబుతుంది.

అసలేమయింది మనకు? అని ఇద్దరూ ప్రశ్నించుకుంటారు. ఇద్దరిలో ఏ ఒక్కరి వద్దా సమాధానం లేదు. ఇద్దరూ స్నేహితుల్లాగా కేవలం పరిచయస్తుల్లాగా నిలిచిపోయే వారిని తడిపేస్తూ భారీ వర్షం కురుస్తుంది. దర్శకుడు చిత్రాన్ని అసంపూర్తిగా, ఓపెన్‌గా ముగించేస్తాడు.

భార్యాభర్తలుగా విచ్ఛిన్నమయిన వారి అనుబంధం సరికొత్తగా మంచి స్నేహితుల్లా తిరిగి రూపుదిద్దుకునే క్రమాన్ని సూచిస్తూ దర్శకుడు ఓ కొత్త కోణాన్ని దృష్టి సినిమాకి సంతరింపచేశాడు. కుటుంబంలో భార్యా భర్తల నడుమ సమిష్టితత్వం అలవడనప్పుడు ఎవరి పరిధిలో వాళ్ళు వారిష్టం ప్రకారం నడుచుకునే సమయంలో కుటుంబాలు ఇట్లాగే ఉంటాయన సూచన కూడా లేకపోలేదు. అంతేకాదు. - భార్యాభర్తలను వివాహ బంధమూ సమాజంలో ఆమోదితమైన కుటుంబ విలువలూ, మరేవీ కూడా కట్టిపడేయ లేవనీ, గొప్ప స్నేహబంధాలతో కూడిన జీవితాలే సమస్త ఆనందాలకు మూలమవుతాయన్న విషయ నిర్ధారణ ‘దృష్టి‘ సినిమాలో జరిగింది. సినిమాటిక్ నరేషన్‌లో కూడా గోవింద్ నిహలానీ ఈ చిత్రంలో వైవిధ్యాన్ని కనబర్చారు. ఇందులో మొత్తం స్పేస్‌ని నిఖిల్ సంధ్యలు ఆక్రమించగా ప్రింద దాదాపుగా సినిమాటిక్ స్పేస్ లోకి రాదు.

విద్యావతులయిన మహానగర భార్యాభర్తల మానసిక స్థితిని ‘దృష్టి‘ గొప్పగా ఆవిష్కరించింది. విధ్వంసంవుతున్న విలువలు సంక్షుభితమయిపోతున్న సంబంధాలు ఫలితంగా పెరుగుతున్న దూరాలు ఈ చితంలోని రెండు పాత్రల నడుమ ప్రతిభావంతంగా చిత్రించబడింది. ‘దృష్టి‘ చిత్రీకరణలో ఎలాంటి గిమ్మిక్కులు లేవు. గొప్ప లైటింగ్, టెక్నిక్ అంటూ ఏమీలేదు. సీదాసాదాగా సాగిపోయే ఇద్దరు మనుషులతో విశిష్ట చిత్రంగా రూపొందింది.

❋❋❋

**NEW**
Click here to share your comments on this article.